11

# సూది సాహసం

హిమాలయ ప్రాంతంలోని ఒక అడవిలో భయంకరమైన సింహం ఒకటి ఉండేది.

అది అడవిలోని జంతువులన్నింటినీ చంపుతూ నానా బీభత్సం సృష్టించసాగింది. ఎన్నో చావగా, మరెన్నో అడవి వదిలిపెట్టి పారిపోగా, మిగిలిన జంతువులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని బ్రతకసాగాయి.

ఈ పరిస్థితి చూసి ఒక సూది ఈ పీడను ఎలాగైనా తొలగించాలని నిశ్చయించుకుంది. ఆ ఆలోచన రాగానే అది ఒక 'సుత్తి' దగ్గరకు వెళ్ళి, దాని సహకారాన్ని కోరింది. సుత్తి అందుకు ఒప్పుకుంటూ, 'కందిరీగ, కొండచిలువ, ఆవు పేడ' ల సహాయం కూడా తీసుకోవాలని సలహా ఇచ్చింది. అవన్నీ కలిసి సింహాన్ని అంతం చేయడానికి ఒక పథకాన్ని వేసుకున్నాయి.

పథకం ప్రకారం... అవి అన్నీ చీకటి పడే సమయానికి సింహం గుహని చేరుకొన్నాయి.

అప్పటికింకా సింహం వేట నుంచి తిరిగి రాలేదు. సూది వెళ్ళి సింహం పడకలో మొన పైకి ఉండేటట్లు నిలువుగా దాక్కొంది. సుత్తి గుహ ద్వారం పైన నక్కింది. కందిరీగ అద్దం దగ్గర జేరింది. కొండచిలువ దీపం క్రింద చుట్టుకు పడుకొంది.

సింహం బాగా వేటాడి కడుపారా తిని, భుక్తాయాసంతో గుహని చేరింది. దీపం కూడా వెలిగించుకోకుండా వెళ్ళి ప్రక్కమీద కూలబడింది. వెంటనే సూది కస్సున దాని పొట్టలోకి దిగిపోయింది.

సింహం బాధతో అరుస్తూ దీపం వెలిగించి చూద్దామని వెళ్లేసరికి, కొండచిలువ తలెత్తి బలంగా దాని ముక్కుమీద మోదింది.

ముక్కు పగిలి నెత్తురు కారుతుంటే... గాయం చూసుకుందామని అద్దం దగ్గరికి వెళ్లేసరికి కందిరీగ దాని రెండు కళ్లల్లో కుట్టేసింది.



వెంటనే అరుస్తూ సింహం బయటకి పరుగెత్తేసరికి అక్కడవున్న పేడమీద కాలువేసి జారి క్రింద గోతిలో పడిపోయింది. వెంటనే సుత్తి, కొండచిలువ వెళ్లి సింహాన్ని చితక బాదసాగాయి. కందిరీగ ఒళ్ళంతా కుట్టేసింది. వీటితో ఆ సింహం చచ్చిపోయింది.

తర్వాత సూదిని బయటకు తేవాలని అవి ఎంతో ప్రయత్నించాయి. కాని, సాధ్యపడలేదు. తర్వాత సింహం శరీరం గట్టిపడి పోవడంతో సూది కూడా శాశ్వతంగా అందులోనే ఉండిపోయింది.

సూది చేసిన త్యాగం వల్ల ఆ అడవికి పీడ విముక్తి అయింది. ఆ త్యాగాన్ని మరిచిపోలేకుండా అక్కడి చెట్లు సూదిమొన చెట్లుగా మారిపోయాయి. ఇప్పటికీ అవి అలాగే ఉన్నాయి. రోజూ వాటి ఆకారాలు కన్నీరు కారుస్తూంటాయి.

★★★